# బురఖా

శ్రీకొల్ల సత్యనారాయణమూర్తి

రాజమండ్రి గోదావరి స్టేషను కోటగుమ్మం ఇక్కణ్ణించే రాజవీధి. ఇటూ అటూ కూలగొట్టబడ్డ కొట్లు, భవంతులు. బజారు బజార్లో—ఫ్యాన్సీ, మెడికల్, ఎలక్ట్రికల్, ఇనుప సామాన్లు స్టెయిన్లెస్‌స్టీల్ ఇత్తడి, రాగిపాత్రలు—రకరకాల కొట్లు. శాఖాహార, మాంసాహార హోటళ్ళు.

లాడ్జింగులు—చిన్నవి, పెద్దవి, ఓ మోస్తరువి. నాణ్యమైనవి, నాసిరకంవి.

రాజమండ్రి దక్షిణకాశీ. గోదావరి ఒడ్డున ఎన్నో గుళ్ళు.

మెయిన్ రోడ్డుమీద రెండు మసీదులున్నై. ఆపైన జాంపేట బ్రిడ్జి దగ్గర పెద్ద చర్చి.

మనది మతప్రమేయంలేని లౌకిక రాజ్యం. ఇండియా—దటీజ్ భారత్.

ఈ భారత్‌కి యీ వూరు ఓ ప్రత్యేకత పొద్దున్న ఆరు దాటుతోంది. ఊరు పూర్తిగా యింకా మేలుకోలేదు. కోట గుమ్మందగ్గర మెయిన్‌రోడ్డుమీద ఒకటి రెండు దుకాణాలూ, కాఫీ హోటళ్ళూ తీశారు.

మసీదు యెదురుగా ఇరానీకేఫ్‌ని ఆనుకుని వున్న కిళ్ళీషాపు తెరుస్తున్నాడు—షరీఫ్ "బిస్మిల్లా" అనుకుంటూ.

సరిగ్గా యిదే సమయానికి నల్లపరదాలో ఓ పిల్ల రోడ్డుమీది కొచ్చింది. వడిగా నడుస్తోంది. నాలుగడుగులు వేసిందో .లేదో వెనక నుంచి ఓ సైకిలు దూసుకొచ్చింది.

సైకిల్‌మీద వీర్రాజున్నాడు. వీర్రాజు హోల్‌సేలు చింతపండు వ్యాపారి, గవర్రాజు కొడుకు.

వీర్రాజు సైకిల్‌మీద పరదాపిల్లదాకా వచ్చి ఆమె మొహంమీది గుడ్డను లాగేశాడు. పరదాలోనిపిల్ల కెవ్వుమంది.

ఓ సైకిల్‌రిక్షా వచ్చి ఆగింది. పిల్ల రిక్షా యెక్కేసింది. రిక్షా సాగిపోయింది. వీర్రాజు సైకిల్ పెడల్‌మీద కాలేశాడు

వీర్రాజు కాలర్ పట్టుకుని ఆపాడు షరీఫ్.

మసీదు అరుగుమీద కూచున్న కొందరు, ఇరానీ హోటలు స్టాఫూ, చెప్పుల దుకాణాలు తెరుస్తున్నవారూ, ఆ దృశ్యం చూసి చుట్టూ మూగారు.

వీర్రాజు మాటెవరూ వినిపించుకోలేదు. షరీఫ్ చెప్పిందాన్నిబట్టీ, కొందరు తాము చూసినదాన్నిబట్టీ "మారో" అంటే "మారో" అన్నారు.

రాజవీధిని అనుకున్న ఓ లాడ్జింగ్ హౌస్ పై అంతస్థులోంచి వీర్రాజు స్నేహితులు జరిగింది చూసి పరుగున వచ్చారు.

వారు వచ్చేటప్పటికే అంతా అయిపోయింది. వీర్రాజు రోడ్డు మీద పడున్నాడు. నొసలు చిట్లింది. స్పృహలో లేడు.

షరీఫ్ పనీ, అతని అనుచరులపనీ పట్టడం కన్నా వీర్రాజుని ఆసుపత్రికి తీసుకుపోడమే అర్జంటనిపించింది వీర్రాజు స్నేహితులకి.

కోట గుమ్మంవైపు పోతున్న టేక్సీని ఆపి, వీర్రాజుని అందులో వేసుకుని గవర్నమెంటు ఆసుపత్రికి తీసుకుపోయారు.

మధ్యాహ్నం పన్నెండు దాటుతోంది.

మసీదులో నమాజుకొచ్చిన వారంతా ఆ ఉదయం జరిగింది కథలు కథలుగా చెప్పుకోసాగారు. షరీఫ్‌ని హీరోలాగా చూశారు.

అతనితో చనువున్నవారు, "స్సలామాలేకుం" చెప్పి 'గలేలగ్జా' యించారు.

ఉన్నట్టుండి మసీదులో రాళ్ళ వర్షం కురిసింది. కర్రల్తో, కత్తుల్తో, సైకిల్‌చైన్లతో, కొరడాలతో ఓ వందమంది మసీదు చుట్టు

ముట్టారు.

ఇది గవర్రాజు పనే నని గ్రహించడానికి ఆట్టే సేప్పట్లేదు లోపలివారికి.

మసీదు మైకులోంచి ఎనౌన్సుమెంటు వచ్చింది.

జోళ్ళ దుకాణదారులు, దర్జీలు, కళ్ళ జోళ్ళ షాపులవారు, వాచీ మెకానిక్ షాపుల వార్నీ ఉద్దేశించి, మసీదు ముట్టడెందనీ, వెంటనే తరలిరమ్మని పిలుపునిచ్చాయ్, మసీదు మైకు తాలూకు స్పీకర్లు.

వీర్రాజు తండ్రి గవర్రాజు నియోగించిన రౌడీలు, కిరాయి మనుషులు, షరిఫ్ కిళ్ళీ దుకాణం బద్దలుకొట్టి సరుకూ సరంజామా అంతా ధ్వంసంచేసి పారేశారు.

మసీదు పిలుపు నందుకుని ఆయా కొట్ల వారు కొట్లు కట్టేసి బయల్దేరారు. మసీదులోని వారు ధైర్యంచేసి బయటికొచ్చారు. బయట వున్న, వీరి మద్దతుదారులు గవర్రాజు మనుషులమీద తిరగబడ్డారు.

కోటగుమ్మంలో బీటు కాస్తున్న కానిస్టేబులు సైకిలెక్కి స్టేషన్‌కి ఉడాయించాడు.

సోడాబుడ్లు బద్దలయ్యాయి.

సైకిల్ చైన్లు 'ఛెళ్ ఛెళ్ళ' మన్నాయి.

రక్తాలు కారాయి. దొమ్మీ

కొట్లాట—

దుమ్మూ ధూళీ రేగింది.

తలలు బద్దలయ్యాయ్.

ఎముకలు విరిగాయ్.

మధ్యాహ్నపు ఎండలో చాకులు తళతళమన్నాయ్

వేడిరక్తం చిమ్మింది.

నలుగురైదుగురు అక్కడే చచ్చారు.

షరీఫ్ వర్గం—గవర్రాజు వర్గం—

"మారో"—"మార్ డాలో"—

అంటుంటే—

"కొట్టండి చంపండి చంపవతల పారేండి."

భీభత్సం—పోరు హోరాహోరీ సాగుతోంది.

అరగంట గంట

పోలీస్‌వాన్ దిగింది.

పోలీసువారి హెచ్చరిక

కొట్లాట కొనసాగుతోంది.

మరో హెచ్చరిక మరో హెచ్చరిక

పొగబాంబులు పేలాయి.

లాఠీఛార్జి జరిగింది.

తుపాకులు పేలాయి.

వన్‌ఫార్టీఫోర్ అమల్లోకి వచ్చింది.

* * *

ఆ సాయంత్రం మొదలు తెల్లవార్లూ పోలీసులు గస్తీ తిరుగుతూనే వున్నారు. కంబాల చెరువుదగ్గర, కూరగాయల మార్కెట్లోనూ, గాంధీ విగ్రహాల దిమ్మలకు చుట్టూ తుపాకులు నిలబెట్టి విడత విడతకీ మధ్య పోలీసు బృందాల వారు, ఒకర్ని విడిచి ఒకరు విశ్రాంతి తీసుకుంటూ శాంతిభద్రతలను కాపాడ్డానికి పాటు పడుతూనే వున్నారు.

తెల్లవారగట్ల తెలియవచ్చాయ్—ఆ రాత్రి జరిగిపోయిన ఘోరాలు

అనుపత్రిలో వీర్రాజు వచ్చిపోయాడు. కిళ్ళీ కొట్టు షరీఫ్ నెత్తిమీద సోడాబుడ్డి బద్దలైంది.

ఆకుచెప్పు లమ్ముకునే బాషాభాయ్ చేతులు నరుకుడై పోయాయ్.

వాచీ మెకానిక్ జహంగీర్ కొట్టుకి నిప్పంటుకుంది

శనిదానాలు పట్టీ, పుణ్యాహవచనాలు జరిపించి, పొట్టపోసుకునే, పేరిశాస్త్రిమీద నించి గోదారిగట్టున టేక్సీ దొర్లుకుని వెళ్ళిపోయింది.

గవర్రాజు హోల్సేలుకొట్లో కాటామేస్త్రీ అప్పలస్వామి కత్తిపోట్లు తిని ఇసుకవీధిలో పడున్నాడు.

సూరీడు పొడుస్తున్నాడు.

అరుగంట్ల ఇంగ్లీషు వార్తల్లో రేడియో చెప్పింది—"రాజమండ్రీలో కర్ఫ్యూ " అని.

ఈ వార్త అచ్చయి పేపర్లలో వచ్చేసరికి- ఆ మర్నాడైంది.

* * *

ద్వారపూడిలో రైసుమిల్లు.

రైసు మిల్లు కాంపౌండులోనే రెస్టు హౌసు !

ఇందులో విడిది చేసింది సావిత్రి. సాయంకాలం—ఆరు దాటుతోంది. టీపాయ్‌మీది పేపరు తిరగేసి సావిత్రి దిమ్మ తిరిగిపోయింది. తన సూట్ కేసువైపు చూసింది.


"ఏం అల్లా" అనుకుంది.

టీపాయ్‌మీదనుంచి గ్లాసందుకుని అందులోని పానీయాన్ని గడగడా తాగేసింది.

సావిత్రి కళ్ళు ఎర్రబడ్డాయ్. ఒళ్ళు వేడెక్కింది. ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో వేడి ఆవిర్లు!

సోఫాలోంచి లేచి ఒళ్ళు విరుచుకోబోయింది. తనవల్ల కాలేదు. సోఫా సెట్ ఉన్న కార్పెట్ మీద కూలిపోయింది.

రైసుమిల్లు ఓనరు పానకాలరావు తలుపు



తీసుకొని లోపలికొచ్చాడు. మందుమీదున్నా, ఆయన నిగ్రహంగానే వున్నాడు.

పానకాలరావుని చూడ్డమే తడవు సావిత్రి పాములాలేచింది.దగ్గరకంటూ వచ్చేశాడాయన.

సావిత్రి ఒక అడుగు వెనక్కి వేసింది. "ఒద్దు నన్ను ముట్టుకోకండి. నేను నేను అమ్మవారిని. అంబని చండిని మంటలు మండుతాయ్. మనుషులు చచ్చిపోతారు. నెత్తురు ఏరు అవుతుంది. వద్దు నేను సైతాన్ని పాపాత్మురాల్ని. మనుషుల్ని తినేస్తాను. ఊళ్ళకి ఊళ్ళనే బలి తీసేసుకుంటాను.

దూరం దూరంగా వుండండి. బూడిదై పోతారు మసి మసైపోతారు "

"సావిత్రీ" పానకాలరావు గాండ్రించాడు. "ఏవిటా పూనకం? యెందుకలా రెచ్చిపోతావ్? యేమైంది నీకు?"

సావిత్రి మాట్లాడలేదు. పేపరు చేతికిచ్చింది. తన సూట్ కేసు చూపించింది.

నిముషంలో పానకాలరావు విషయం గ్రహించాడు. సావిత్రిని చాచిపెట్టి కొట్టాడు.

"అట్టే అల్లరి చేసి వీధిన పడ్డావంటే ముక్కలు ముక్కలుగా నరికి పారేస్తారు— అంతా కలిసి. శవంకూడా మిగల్దు. కిక్కురుమనకుండ పడుండు."

ఆ గదిలో ఓ పక్క టేబిల్ మీది సూట్ కేస్ పైనున్న నల్ల బురఖా అంది పుచ్చుకుని పానకాలరావు బైటికి నడిచాడు. బైట తలుపు తాళం వేశాడు.

లోపల, సావిత్రి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఆరోజు ఆ రాత్రి ఆ ఉదయం

"ఐ క్లాసు పాసింజరు. రూం నంబరు ఆరో కెళ్ళు—" లాడ్జీ కుర్రాడి మాటమీద తను ఆరోనెంబరు గదిలో కాలు పెట్టింది.

ఓ అరడజనుమంది తాగుతూ పేకాడుకుంటున్నారు.

"రా తాగుతావా? ఇంద" వీర్రాజు తను తాగే గ్లాసు అందించబోయాడు.

గిరుక్కున వెనుతిరిగి గదిలోంచి బైట పడింది. బైట గడియవేసి పరుగెత్తింది.

లాడ్జీ ఆఫీసుగదిలోకి వచ్చింది. "ఏం "ఆ గదిలో ఆరుగురున్నారు."

"వీర్రాజుగారు 'ఒక్కణ్నే' అన్నాడు? సరే—నువ్విక్కడే వుండు అర్యుగో వాళ్ళు గోల చేస్తున్నారు. నువ్వు లోపల గడియ పెట్టుకో. నేను బైట తాళం వేస్తాను. నువ్వు నే వచ్చేవరకు యిక్కడే వుండు" లాడ్జీ కుర్రాడు బైట తాళం వేసి ఆరోనెంబరు గది దగ్గరికి వెళ్ళాడు.

గదిలో పాసింజర్లు తలుపులు బాదుతున్నారు. కేకలేస్తున్నారు. అరుస్తున్నారు — తిట్లి పోస్తున్నారు. కాలింగ్ బెల్ నొక్కుతున్నారు

"పోలీసు లొచ్చారు. గొడవెట్టకండహే" లాడ్జీ కుర్రాడిమాటతో వారినోళ్లు మూతబడ్డాయి.

తెల్లవారగట్ట, విషయం తెలిసి మండిపడ్డారంతా లాడ్జీ కుర్రాడు డ్యూటీ దిగి వెళ్ళి పోయాడన్నారు.

కొంతసేపటికి, పరదాలో, లాడ్జీ గుమ్మం దాటి రోడ్డెక్కుతున్న పిల్ల వాళ్ళ కంటబడింది. వీర్రాజు పౌరుషంగా మేడ దిగి అక్కడున్న సైకిల్ వేసుకుని వెంబడించాడు

జరిగింది తలపుకొచ్చేసరికి సావిత్రి కి ముచ్చెమటలు పోశాయ్.

తనమీద తనకే అసహ్యమేసింది. "ఛీ" అనుకుంది.

ఈ సావిత్రి హిందువా? ముస్లిమా?

'సావిత్రి' కాబట్టి హిందువని, పరదా వేసుకుంది కాబట్టి ముస్లిమనీ—ఆమె చెబుతోంది కాబట్టి ఫలానా అని నిర్ధారణకు రావడానికి వీల్లేదు. ఆమెను నమ్మడానికి అసలు వీల్లేదు. వృత్తిరీత్యా ఆమె జాతి అటువంటిది.

ఆమె యెవరైనా, అందరికీ సిగ్గుచేటే. తలవంపులే. వీర్రాజువంటి కామాంధులు కూడా దోషులే. పాపులే.

షరీఫ్ వంటి—షరీఫ్ లే కాలం కావాలంటున్నది.

ఎందుకంటే—వీర్రాజుని 'హమ్లా' చేసిన క్షణంలో—షరీఫ్ మనసులో అడకూతుర్ని ఆదుకుందామన్న ఆదుర్దాయే గానీ, ముస్లిం పిల్లన్న సంకుచిత భావం కించిత్తుకూడా లేదు